క్లుప్తంగా

ఆర్డీఓ పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం–చెన్నూరురోడ్డుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ తదితర విషయాలపై నెల్లూరు ఆర్డీఓ అనూష గురువారం పరిశీలన చేశారు. భూసేకరణ, రోడ్డు నిర్మాణం తదితర విషయాలపై తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లుతో చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక అధికారులు ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

పారిశుద్ధ్య పరిరక్షణే లక్ష్యం



పంచాయతీ కార్యాలయంలో పరిశీలిస్తున్న డీపీఓ

ఇందుకూరుపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం ఇందుకూరుపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఇంటింటి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్త సేకరణ ద్వారా సంపద సృష్టించాలని అధికారులకు సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పెంచలశ్యామ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జట్ల కొండూరులో పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండి తప్పనిసరి అనుకుంటే తప్ప పురుగు మందులు పిచికారీ చేయొద్దన్నారు. రసాయన ఎరువుల వినియోగంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించి, వారిని సామాజికంగా ఆర్థికంగా ఆదుకోవాలని పద్మశాలి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చేవూరు చలమయ్య అన్నారు. పట్టణంలోని కాశీపాళెంలో భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి ఆలయంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారానికి ఒకసారైనా చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో నరసయ్య, సురేంద్రబాబు, రాధాకృష్ణయ్య, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): హాస్టల్ నుంచి ఇంటికి బయలుదేరిన యువతి అదృశ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు.. బోగోలు మండలానికి చెందిన ఓ యువతి నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 6వ తేదీన ఆమె దుస్తులు తీసుకుని ఇంటికి వెళ్తున్నానని చెప్పి హాస్టల్ నుంచి బయలుదేరింది. ఈ విషయాన్ని హాస్టల్ సిబ్బంది యువతి తల్లికి ఫోన్‌చేసి చెప్పారు. తల్లి కుమార్తెకు ఫోన్ చేయగా స్విచాఫ్‌లో ఉంది. కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లి తన బంధువులతో కలిసి నెల్లూరుకు చేరుకుంది. కుమార్తె అదృశ్యంపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పద్మావతి సెంటర్‌కు చెందిన రవిప్రసాద్ తడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు ఆయన రైలులో తడకు వెళ్లి వచ్చేవాడు. ఈనెల 3వ తేదీ సాయంత్రం ఆయన వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో రైలు దిగారు. పార్కింగ్‌లో ఉన్న బైక్‌లో మెజర్‌మెంట్ బుక్స్ పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. గాంధీనగర్ రోడ్డులో ఓ దుకాణం ముందు బైక్‌ను నిలిపి పక్కనే ఉన్న మరో దుకాణం వద్దకు వెళ్లి వచ్చేలోపు బైక్ చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెరవేరని 'ఉపాధి' లక్ష్యం

- రెండున్నర నెలలుగా ఆగిన నగదు చెల్లింపులు
- అనుభవం లేని ఎఫ్‌ఏలతో ముందుకు సాగని పనులు
- హాజరు కాని కూలీలు
- మిగిలిపోతున్న పనిదినాలు
- నెలాఖరుకు పూర్తి చేయాలని టార్గెట్లు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలు నెరవేరడం లేదు. కూలీలకు చెల్లింపులు, అనుభవం లేని క్షేత్ర సహాయకులతో పొదలకూరు క్లస్టర్ పరిధిలోని నాలుగు మండలాల్లోని పరిస్థితులపై డ్వామా పీడీ గంగాభవాని సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓవైపు ఆగ్రహం వ్యక్తం చేస్తూనే.. శాఖాపరమైన ఒత్తిళ్లను కిందిస్థాయి సిబ్బందికి వివరించారు.



పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు (ఫైల్)

పొదలకూరు: పెద్ద మండలమైన పొదలకూరులో గతంలో నిత్యం నాలుగు వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేవారు. ప్రస్తుతం 1,500 మంది కూడా పనులకు రావడం గగనంగా మారింది. దీనికితోడు ఎక్కడ పనిపెట్టినా నాయకుల జోక్యం అధికమైంది. దీంతో పనులు చేయించే టీఏలు, ఈసీలు ఇబ్బందులు పడుతున్నారు. పనుల్లో తేడా వస్తే సోషల్ ఆడిట్లో రికవరీలు రాస్తున్నందున పనులు పెట్టకుంటేనే మేలనే ఉద్దేశంతో ఉన్నారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్లో ఇద్దరు టీఏలు, ఒక ఈసీ ఉద్యోగాలు కోల్పోవడంతోపాటు రూ.లక్షలు రికవరీ రాశారు. ఫలితంగా మండలంలో పనులు చేసేందుకు ఉపాధి ఉద్యోగులు ముందుకు రావడం లేదనే ప్రచారం జరుగుతోంది.

పెద్ద మొత్తంలో..

దాదాపు రెండున్నర నెలలుగా కూలీలకు చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో రూ.48 కోట్లు పెండింగ్లో ఉంటే రూ.32 కోట్లు చెల్లించినట్టు అధికారులు వెల్లడించారు. మరో రూ.16 కోట్లు కూలీల వేతన చెల్లింపులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. పొదలకూరు మండలంలో సుమారు రెండున్నర నెలలుగా 60 వేల మ్యాన్‌డేస్‌కు సంబంధించి రూ.1.50 కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉంది. పనులకు కూలీలు హాజరు కాకపోవడానికి ఇదే పెద్ద కారణమని ఉద్యోగుల మాట. ఎప్పటికప్పుడు డబ్బులు అందజేసే పనులకు కూలీలు వెళ్లడం వల్ల ఉపాధి లక్ష్యాలు ముందుకు సాగడం లేదని క్షేత్ర సహాయకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అరకొరగా కూలీలు హాజరవుతున్నట్టు చెప్పుకొస్తున్నారు. అనుభవం ఉన్న క్షేత్ర సహాయకుల తొలగింపు, వేధింపులు తట్టుకోలేక స్వచ్ఛందంగా రాజీనామాలు ఇవ్వడం వల్ల దాదాపుగా పాత ఎఫ్ఏలు లేకుండాపోయారు. కొత్తగా చేరిన వారికి అనుభవం లేకపోవడంతో కూలీలను పనులకు రప్పించలేకపోతున్నారనే విమర్శలు న్నాయి. ఉపాధి పథకంలో ఎన్ని సంస్కరణలు తెచ్చినా పనుల్లో అవినీతిని పూర్తిగా రూపుమాపలేకపోతున్నారు.

ఇకపై ఫేస్ యాప్‌తో కట్టడి

త్వరలో ఉపాధి పనుల్లో ఫేస్ యాప్‌ను ప్రవేశపెట్టి అవినీతిని పూర్తిగా కట్టడి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీనిపై క్లస్టర్ల వారీగా క్షేత్ర సహాయకులకు శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఆధార్ మ్యాపింగ్ ద్వారా ఫేస్ యాప్‌లో పనులకు హాజరయ్యే కూలీల ముఖం అప్‌లోడ్ అవుతుంది. దీంతో దూరప్రాంతాల్లో ఉన్న వారికి మస్టర్ వేయడం, వారి బదులు కుటుంబంలో మరొకరు పనులకు హాజరు కావడం వంటి వాటికి చెక్‌పెట్టొచ్చని అంటున్నారు. అయితే ఈ యాప్ వల్ల ఏ మేరకు ఉపయోగం ఉంటుందో అమలు తర్వాత తెలియాల్సి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని (ఫైల్)

కూలీల సంఖ్యను పెంచుతాం

మండలంలో 30 పంచాయతీలున్నాయి. పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తాం. కూలీల నగదు చెల్లింపులు త్వరలో బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. రెండున్నర నెలలుగా చెల్లింపులు నిలిచిపోవడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులున్నాయి. కూలీలకు అవగాహన కల్పించి సంఖ్యను పెంచుతాం. త్వరలో ఫేస్ యాప్ అమల్లోకి వస్తుంది.

– వెంకటేశ్వర్లు, ఏపీఎం, పొదలకూరు

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ శోభారాణి

పొదలకూరు: పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తెలిపారు. మండలంలోని మహ్మదాపురం దొడ్ల శంకరమ్మ సంక్షేమ వసతి గృహాలను డీడీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం నూతన భవనాలను దొడ్ల డెయిరీ యజమాన్యం నిర్మించినట్టు చెప్పారు. చిన్నపాటి మరమ్మతులను తాము శాఖాపరంగా చేపట్టడం జరుగుతుందన్నారు. మంచినీరు తదితర పనులకు నిధులను మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. మహ్మదాపురం హాస్టళ్లలో 160 మంది విద్యార్థులున్నారని వారిలో 24 మంది పదో తరగతి చదువుతున్నట్టు పేర్కొన్నారు. ట్యూటర్లను ఏర్పాటు చేస్తామని విద్యార్థులు మంచిమార్కులతో పాస్ అయ్యేందుకు కృషి చేయాల్సిందిగా సంక్షేమాధికారులకు సూచనలు చేసినట్టు వెల్లడించారు. హాస్టళ్లలో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

వెంకటాచలం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో వెంకటాచలంలోని సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించి రైతులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యవసాయంలో వస్తున్న నష్టాలతో అన్నదాతలు కుంగిపోతున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో మరింత ఇబ్బంది పెట్టొద్దన్నారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ కన్వీనర్ తలారి దేవదానం, నేతలు ఓడూరు వెంకటకృష్ణయ్య, ఎస్కే సిరాజ్, తుమ్మతాటి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతోపు చర్చిలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు గ్రామంలో ఉన్న బేతేలు బాప్టిస్ట్ చర్చిలో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బుధవారం రాత్రి ఫాదర్ విజయ్‌కుమార్ చర్చికి తాళాలు వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చర్చి తాళం తీసి హుండీని ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న ఓ లేఅవుట్‌లో దానిని పగులగొట్టి రూ.7 వేల నగదును దోచుకెళ్లారు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న చర్చి విజయ్‌కుమార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులే ఇలా చేసి ఉండొచ్చని సంఘస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్రబాబు తెలిపారు.

స్వల్పంగా పెరిగిన నిమ్మ ధరలు

- గతేడాది ఇదే సీజన్‌లో బస్తా రూ.9 వేలు
- తోటల్లో తగ్గుతున్న కాయలు



మార్కెట్‌కు వచ్చిన కాయలు

పొదలకూరు: నిమ్మ ధరలు స్వల్పంగా పెరిగినట్టు వ్యాపారులు వెల్లడించారు. గతేడాది ఇదే సీజన్‌లో బస్తా కాయల ధర రూ.9 వేల వరకు పలికింది. ఈ ఏడాది నిమ్మ సాగు రైతులకు కలిసిరాలేదు. మంచి సీజన్‌లో సైతం సక్రమంగా ధరలు పలికింది లేదు. తోటల్లో దిగుబడి పెరిగి ధరలు పతనమై రైతులు తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఒక కిలో రూ.20 నుంచి రూ.31 వరకు ఉంది. ఒక బస్తా (లూజు) రూ.1,600 నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది. వినాయక చవితి, దసరా తర్వాత తిరిగి కాయల ధరలు పతనమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రావణ మాసం కావడం అమ్మవారి పూజలు జరుగుతున్నందున స్వల్పంగా ధరలు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. కాగా నిమ్మ తోటల్లో దిగుబడి తగ్గుతున్నట్టు రైతులు తెలిపారు. ఈ కారణంతో కూడా ధరలు స్వల్పంగా పెరుగుతున్నట్టు చెప్పుకొస్తున్నారు. మరో నెలరోజుల్లో తోటల్లో పూర్తిగా కాయలు లేకుండాపోతాయి. దిగుబడి తగ్గిన సమయంలో ధరలు పెరగడం సాధారణ విషయంగా పేర్కొంటున్నారు. దిగుబడి ఉన్న సమయంలో ధరలు పెరిగితే రైతులు కొంత ఆర్థికంగా పుంజుకునే అవకాశం ఉంటుంది. దసరా సందర్భంగా కొందరు తిరిగి తమ వ్యాపారాలను ప్రారంభించడంతోపాటు రైతులకు అడ్వాన్సులు సైతం అందజేస్తుంటారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



పూజలు నిర్వహిస్తున్న పిల్లలు

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో గురువారం ముందస్తు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా సామగ్రిని ఏర్పాటు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. కరస్పాండెంట్ జి.కామాక్షి వ్రతం విశిష్టతను పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

- పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తామని ఉభయకర్తలు ఆదూరు వెంకటసుబ్బయ్య – వాసవి దంపతులు తెలిపారు. అమ్మవారు చందనాలంకారంలో దర్శనమిస్తారని, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొనాల్సిందిగా కోరారు.
- తోడేరు పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీపార్వతమ్మ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు గురువారం వెల్లడించారు. మహిళా భక్తులకు ఉభయకర్తలు జి.గోపాల్ – సుభోదిని, జి.రామయ్య – దొరసానమ్మలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు.

తల్లిపాలతో ఆరోగ్యం

కొడవలూరు: బిడ్డ ఆరోగ్యకర ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని నాయుడుపాళెం ఎస్టీ కాలనీలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగాలంటే పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు విధిగా తల్లిపాలనే పట్టించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సునీత, కె.ఎస్తేరమ్మ, పి.మధుసూదనమ్మ, ఎ.అనూరాధ, ఎ.హరిప్రియ, కె.రాధిక, హెల్పర్ కె.సుదర్శనమ్మ పాల్గొన్నారు.

బసవాయపాళెంలో..

మండలంలోని బసవాయపాళెం ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ గిరిజన పిల్లల్లో రక్తహీనత సమస్యలు తలెత్తుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలను పట్టించడంతో పాటు పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, సంపూర్ణ, మమత, రేణుక పాల్గొన్నారు.

- పొదలకూరు: మండలంలోని తోడేరు సచివాలయంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొని మాట్లాడారు. పీహెచ్‌ఎన్ వరలక్ష్మి, ఏఎన్‌ఎం మేరీ, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, కల్యాణి, రమ, సులోచన, కవిత, కామాక్షి, విమల, కొండమ్మ, నిర్మల పాల్గొన్నారు.
- మండలంలోని కనుపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. స్కూల్ టీచర్ రఘు, ఏఎన్‌ఎం గౌరీ, మహిళా పోలీస్ శ్వేత, ఎంఎల్‌హెచ్‌పీ కరిమున్నీసా, అంగన్‌వాడీలు మల్లీశ్వరి, సుజాత, తిరుపతమ్మ, మాధవి, పద్మజా, ఆశావర్కర్ యశోదమ్మ పాల్గొన్నారు.
- వెంకటాచలం: మండలంలోని గుడ్లూరువారిపాళెంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు పి.జ్యోతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు – 2 అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు జరిగాయి. పేడూరు సెక్టార సూపర్‌వైజర్ లలితాంబ మాట్లాడారు. హెల్త్ ఎంఎల్‌హెచ్‌టీ లక్ష్మీప్రసూన, అనురాధ, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, పాపమ్మ, ఆశావర్కర్ మధుసూదనమ్మ, హెల్పర్ కీర్తి లోకపావని, శ్యామల, సుమ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.
- మనుబోలు: మండలంలోని కాగితాలపూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు గౌరి, రేవతి, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: నాయుడుపాళెం ఎస్టీ కాలనీలో..



కొడవలూరు: బసవాయపాళెం ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి సీమంతం



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్



వెంకటాచలం : మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



టీపీగూడూరు మండలంలో..



మనుబోలులో..

రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం

- ఆర్డీఓ అనూష



డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ

మనుబోలు: మండలంలో మనుబోలు – చెర్లోపల్లి మార్గంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ అనూష తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన పట్టా డాక్యుమెంట్లను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుబోలు నుంచి చెర్లోపల్లికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కోసం 220 - 1, 220 - 2 సర్వే నంబర్లలో 4.4 ఎకరాలను సేకరించినట్లు తెలిపారు. రైతులకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత రైతులకు ఏవైనా అభ్యంతరాలుంటే తెలిపాలని కోరారు. పరిహారం అందజేసే జాబితాలో తన పేరు లేదని ఓ రైతు వాపోయాడు. పరిశీలించి న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డీటీ ప్రదీప్‌కుమార్, ఆర్ఐ అరుణ్‌కుమార్, వీఆర్వోలు నాగార్జున రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి..

- గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొడవలూరు: రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తలమంచి రైల్వే స్టేషన్ సమీపంలో 201 - 6 - 8 పోస్టుల మధ్య దిగువలైన్‌లో గురువారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు కథనం మేరకు.. సుమారు 35 - 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి గుర్తుతెలియని రైల్లో నుంచి పడి చనిపోయాడు. అతను బులుగు, తెలుపు చెక్స్ కలిగిన ఫుల్ షర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపై లవ్ సింబల్ అందులో ఐ లవ్ యూ అనే లెటర్స్‌తో టాటూ వేసి ఉంది. ఆచూకీ తెలిసిన వారు రైల్వే దర్యాప్తు అధికారి 98483 43638 ఫోన్ నంబర్‌కు సమాచామివ్వాలని కోరారు.

సాహిత్య సదస్సుకు బుచ్చి ఉపాధ్యాయుడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నేటి నుంచి మూడు రోజుల పాటు బెంగళూరులో దక్షిణాది భాషల సాహిత్య సంగమ సదస్సుకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ హాజరు కానున్నారు. సాహిత్య సంగమ సదస్సుకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని ఆయన గురువారం తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న శామ్యూల్

మనుబోలు: పరిశ్రమల స్థాపనకు యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహకాధికారి శామ్యూల్ అన్నారు. మనుబోలు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీలకు 45 శాతం వరకూ రాయితీలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐపీఓ శ్రీనివాసులు, ఎస్‌బీఐ బీఎం సంతోష్‌కుమార్, ఎఫ్ఓ లక్ష్మణ్, వెలుగు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు జైలు

పొదలకూరు: హత్య కేసులో నిందితులకు గూడూరు 7వ అదనపు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి కథనం మేరకు.. మండలంలోని ఆర్‌వైపాళెం గ్రామ పొలాల్లో 2016 మార్చి 19వ తేదీన చేజర్ల మండలం చేజర్లకండ్రికకు చెందిన నంద్యాల అంకిరెడ్డి (40)ని నక్కా దయాకర్, గురునాదం శ్రీనివాసులు హత్య చేశారు. నిందితులు అంకిరెడ్డితో మద్యం తాగించి బండరాయితో తల పగులగొట్టి హత్య చేసి అతని రూ.50 వేలు నగదు, బంగారు ఉంగరాన్ని ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సదరు కేసులో గూడూరు జడ్జి నిందితులకు శిక్ష విధించారు.

డీఎల్‌పీఓ పరిశీలన

ఇందుకూరుపేట: మైపాడులో డీఎల్‌పీఓ పుట్టా రమణయ్య గురువారం పర్యటించారు. నిధుల వినియోగంపై పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు పరిశీలించిన రికార్డులు సక్రమంగా ఉన్నట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాల్సి ఉందన్నారు.